

## కుట్టు మిషన్ల పంపిణీ

**ప్రజాశక్తి-హుకుంపేట:** మండలంలోని అప్ హెూల్డ్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యాన నిరుపేదలకు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీని బుధవారం చేపట్టడం జరిగిందని ఆ సంస్థ చైర్మన్ ఫిలిప్ తిమోతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటును అందిస్తున్నామన్నారు. ఉచిత కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలకు 23 మంది మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం చేయడం జరిగిందన్నారు.



పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధి తిమోతి

# జిల్లాలో దిగజారిన టెన్త్ ఉత్తీర్ణత

## ఈసారి 48 శాతం మాత్రమే ▸▸ రాష్ట్రంలో చివరి స్థానం

**ప్రజాశక్తి -పాడేరు:** అల్లూరి జిల్లాలో ఈ ఏడాది టెన్త్ ఫలితాలు దిగజారిపోయాయి. గత ఏడాది 90.95 శాతం టెన్త్ ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 9వ స్థానంలో నిలిచింది . ఈ ఏడాది అనూహ్యంగా 48 శాతానికి టెన్త్ ఉత్తీర్ణత తగ్గిపోయింది. దీంతో, రాష్ట్రంలో అల్లూరి జిల్లా టెన్త్ ఉత్తీర్ణతలో అట్టడుగున 26వ స్థానంలో నిలిచింది. జిల్లాలో ఈ ఏడాది వివిధ యాజమాన్యాలకు చెందిన 258 పాఠశాలల నుంచి 11,472 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 5465 మంది మాత్రమే ఉత్తీర్ణులు అయ్యారు. 6007 మంది టెన్త్ పరీక్ష తప్పారు. జిల్లాలోని 16 గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల నుంచి 1272 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షకు హాజరు కాగా 849 మంది ఉత్తీర్ణులై 67శాతం ఉత్తీర్ణత వచ్చింది. 13 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు నుంచి 483 మంది టెన్త్ పరీక్షకు హాజరు కాక 108 మంది మాత్రమే అయ్యారు. 39శాతం ఉత్తీర్ణత వచ్చింది 19 కస్తూరిబా పాఠశాలలకు 41 శాతం ఉత్తీర్ణత వచ్చింది. ప్రైవేటు పాఠశాలల నుంచి 469 మంది టెన్త్ పరీక్షలకు హాజరుకాగా 366 మంది పాస్ అయ్యారు 78శాతం ఉత్తీర్ణత లభించింది. 161 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల నుంచి 73 46 మంది టెన్త్ పరీక్ష రాయగా 3155 మంది పాస్ అయ్యారు. 43శాతం ఉత్తీర్ణత లభించింది. 31 జిల్లా పరిషత్తు పాఠశాలల నుంచి 1168 మందికి గాను 617 మంది ఉత్తీర్ణులయ్యారు.

అల్లూరి జిల్లాలో ఈసారి ప్రైవేట్ పాఠశాలలు మరియు గురుకుల పాఠశాలల్లో టెన్త్ ఫలితాలు కొంత మెరుగ్గా ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో 78శాతం, గురుకుల పాఠశాలల్లో 67శాతం ఉత్తీర్ణత లభించింది. జిల్లాలో ఈసారి టెన్త్ పరీక్షల్లో అనూహ్యమైన ఫలితాలు కనిపించాయి గతంలో నూరు శాతం ఉత్తీర్ణత వచ్చిన పాఠశాలలు అధికంగా ఉండేది. ఈసారి తారు మారయ్యింది. నూరు శాతం మంది విద్యార్థులు పరీక్ష తప్పిన పాఠశాలలే ఎక్కువగా ఉన్నాయి. కొయ్యూరు గురుకుల బాలుర పాఠశాలలో 100 శాతం మంది విద్యార్థులు అలాగే విశాఖపట్నంలోని సి ఓ ఈ మరియు ఎస్ఓఈ గురుకుల ఎక్సలెంట్ పాఠశాలల్లో కూడా నూరు శాతం ఉత్తీర్ణత నమోదయింది. కాగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఈసారి టెన్త్ ఉత్తీర్ణత గణనీయంగా తగ్గిపోయింది. కేవలం 43శాతం ఉత్తీర్ణత రాగా దారకొండ, జరెల, అప్పర్ సీలేరు, డుంబ్రి గుడ, సంగడలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఒక్కరు కూడా పాస్ కాలేదు. దీంతో ఈ ఐదు పాఠశాలల్లో నూరు శాతం ఫెయిల్ పర్సంటేజ్ నమోదు అయింది. అలాగే మరొక 10 ఆశ్రమ పాఠశాలల్లో 90శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు...

జిల్లాలోని కూనవరం మోంటెస్సోరి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆరవ మాధవి 590 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. నెల్లిపాక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి కే.లాస్వంత్ 582 మార్కులతో రెండవ స్థానంలో నిలిచారు. పాడేరు శ్రీ అక్షర హైస్కూల్ విద్యార్థిని ఎస్ నవదీపిక 580 మార్కులు పాడేరు శ్రీ అక్షర హై స్కూల్ విద్యార్థిని జి షర్మిల 580 మార్కులు, చింతపల్లి సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థి రామరాజు 578, పాడేరు జి టి డబ్ల్యూ ఏ హై స్కూల్ విద్యార్థి కే భవాని 577, అడ్డతీగల గురుకుల పాఠశాల విద్యార్థి వై ప్రవీణ్ కుమార్ రెడ్డి 576, పాడేరు మోదమాంబ హై స్కూల్ విద్యార్థి ఆర్ మధుబాబు 576, ఇదే పాఠశాల విద్యార్థిని కే ప్రసన్న 574, రంపచోడవరం గురుకుల పాఠశాల విద్యార్థిని దుర్గ భవాని 571 మార్కులు సాధించి టాప్ టెన్ లో నిలిచారు.



## సిపిఎం నేత శరభన్నకు ఘన నివాళి

**ప్రజాశక్తి- పెదబయలు**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఎం నేత కిల్లో శరభన్నకు ఆ పార్టీ నేతలు ఘనంగా నివాళి అర్పించారు. అడుగుపుట్టు పంచాయతీ వడ్డేపుట్టు గ్రామంలో సంతాప సభ బుధవారం ఏర్పాటు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, మండల కార్యదర్శి సన్ని బాబు, నాయకులు త్రినాథ్, ఎం ఎం శ్రీను, పాలికి లకుకర, సుందర్ రావు , సావిని ధర్మన్న పడాల్‌లు శరభన్న చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై శరభన్న పోరాటాలు చేశారన్నారు.ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులుగానూ, మండల అధ్యక్షులుగా, సిఐటియు మండల కార్యదర్శిగా, సిపిఎం మండల కమిటీ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. అనంతరం జరిగిన సంతాప సభలో కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, శరభన్న మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమన్నారు. ఈ ప్రాంతంలో ఆదివాసుల సమస్యలపై గత 15 సంవత్సరాలుగా అనేక పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. ఈ సంతాప సభ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బుజ్జి బాబు, సునీల్ కుమార్, చిట్టిబాబు, రాజు, రామారావు పాల్గొన్నారు.


శరభన్న చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నేతలు

## నేడు, రేపు దినకర్ పర్యటన

**ప్రజాశక్తి -పాడేరు:**20 పాయింట్ల ప్రోగ్రాం చైర్మన్ లంక దినకర్ ఈనెల 24,25 తేదీలలో ఏజెన్సీలో పర్యటిస్తారని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 24న మధ్యాహ్నం 12 గంటలకు అరకువ్యాలీ చేరుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పి.ఎం. జన్మన్ పథకం అమలు తీరును పరిశీలిస్తారన్నారు. అరకువ్యాలీలో రాత్రి మకాం చేస్తారు. 25 వ తేదీన ఉదయం 10.30 గంటలకు పాడేరు చేరుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షిస్తారు. మ. 2.30 గంటలకు పాత్రికేయులతో సమావేశ మవుతారు. ఆ తరువాత కూటమి ప్రభుత్వ నేతలతో సమావేశ మవుతారు. అనంతరం అరకు వ్యాలీ చేరుకుని రాత్రి మకాం చేస్తారు. 26 వ తేదీన ఉదయం 6.00 గంటలకు బయలు దేరి వెళతారు.

## అరకులోయలో ప్లాస్టిక్‌ను నిషేధించాలి

**ప్రజాశక్తి-అరకులోయ:**పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని అరకులోయ తహసిల్దార్ ఎం.వి.వి ప్రసాద్ తెలిపారు. పర్యాటక కేంద్రంలో ప్లాస్టిక్ విక్రయిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న తహసిల్దారు ప్రసాద్ బుధవారం రాత్రి తమ సిబ్బందితో అరకులోయ లోని దుకాణాల్లో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ విక్రయ దారులపై కేసులు నమోదు చేసి జరిమానా జరిమానా విధించారు. అరకులోయ పర్యాటక కేంద్రం కావడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి పోతుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి విక్రయిదారులపై కేసులు నమోదు చేశారు. నాణ్యతలేని డ్రింక్ బాటిల్ లను పంచాయతీ వాహనంలో ఎక్కించి తరలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు ఆర్ఐలు వీఆర్వోలు పాల్గొన్నారు.


తనిఖీలు చేపడుతున్న అధికారులు



ధర్నా చేస్తున్న వలస ఆదివాసీ గ్రామాల గిరిజనులు

## వలస ఆదివాసీ గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్యలు పరిష్కరించాలి

### సిపిఎం ఆధ్వర్యాన భారీ ర్యాలీ, కలెక్టర్‌కు వినతి

**ప్రజాశక్తి-చింతూరు**

డివిజన్ పరిధిలో వలస ఆదివాసీలు దాదాపు 30 40 సంవత్సరాల నుండి గ్రామాలు ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నారని, వారికి కనీస సౌకర్యాలు మంచినీటి, విద్యుత్, రోడ్డు వంటి సౌకర్యాలు కల్పించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. వలస ఆదివాసీ పిల్లలకు పిల్లలు చదువుకోవడానికి స్కూల్ బిల్డింగులు, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో వలస ఆదివాసులు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, సోయం చిన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న వలస ఆదివాసీ బతుకులు మాత్రం మారడం లేదన్నారు. వాళ్ల గ్రామాల్లో విద్యుత్, మంచినీళ్లు, రోడ్లు, సోలార్లు, స్కూల్ బిల్డింగులు, అంగన్వాడి కేంద్రాలు ఇలా ఏ సౌకర్యం లేదని తెలిపారు. విద్యార్థులకు కులం సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. కొన్ని వలస ఆదివాసి గ్రామాలకి కరెంట్ స్తంభాలు, సోలార్లు మంజూరైనా ఫారెస్ట్ అధికారులు వాటిని ఏర్పాటు చేసుకోవడానికి అడ్డుపడుతున్నారని తెలిపారు. రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఓటర్ ఐడి కార్డులు, జాబ్ కార్డు, ఇంటి పన్నులు వంటివి కల్పించడం లేదన్నారు. అనంతరం వలస ఆదివాసీల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ వలస ఆదివాసి గ్రామాలకు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఫారెస్ట్ నుండి అడ్డంకులు ఉన్న కూడా కచ్చితంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ పూనెం ప్రదీప్, చింతూరు సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు పోడియం లక్ష్మణ్, ముట్టం రాజయ్య, విఆర్ పురం నాయకులు కారం సుందరయ్య, పంకు సత్తిబాబు, నాలుగు మండలాల్లోని వలస ఆదివాసీలు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న సిపిఎం నేతలు

## వేర్వేరు చోట్ల
## 180 కిలోల గంజాయి స్వాధీనం

**ప్రజాశక్తి-పెదబయలు:** పెదబయలు పరిధిలో సీతగుంట ఏఓబి వంతెన వద్ద బుధవారం 65 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని ఎస్ఐ కొల్లి రమణ బుధవారం తెలిపారు పోలీసులకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు స్థానిక ఎస్సై రమణ తన సిబ్బందితో గస్తీ నిర్వహించారన్నారు. ఆటోను నిలుపుదల చేసి తనిఖీలు నిర్వహించగా అందులో గంజాయి లభ్యమైందన్నారు ఈ ఘటనలో కోరాపుట్ జిల్లా నందుపూర్ బ్లాక్ మత్రిపాలెం గ్రామానికి చెందిన లబో కిండంగ్, డుంబ్రిగూడ మండలంకు చెందినా బురిడి అర్జున్‌లను అదుపులో తీసుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామన్నారు. ఆటోను సీజ్ చేయడం జరిగిందన్నారు.


పెదబయలులో పట్టుబడిన నిందితులు

**చింతపల్లి:**అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ కీలక ఆపరేషన్ లో పోలీసులు 115 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేయడం జరిగిందని సిఐ వినోద్ బాబు తెలిపారు. ఆయన చింతపల్లి పోలీస్ స్టేషన్ లో అన్నవరం ఎస్సై వీరబాబుతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నవరం గ్రామ శివారులో పోలీసులు వెహికల్ చెకింగ్ చేస్తుండగా గమనించిన ఒక ఆటోలోని ఇద్దరు వ్యక్తులు, బైక్ పై వస్తున్న మరో ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు వారిని పట్టుకున్నారన్నారు. ఆటోలో 115 కిలోల గంజాయి లభించిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.


సమస్యలపై ప్రశ్నిస్తున్న సభ్యులు

## గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి
### -మండల సమావేశంలో పలువురు సభ్యులు

**ప్రజాశక్తి -ముంచింగి పుట్టు:** మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని మండల ఇన్చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైస్ ఎంపీపీ పాటు పోయి సత్యనారాయణ మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ పథకం అమలులో నాణ్యత ప్రమాణాలు పాటించలేదన్నారు. రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి రాబోయే వర్షాకాలంలో రవాణా సౌకర్యాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.పీఎం జన్మన్ గృహాల బిల్లులు తక్షణమే చెల్లించాలని, లబ్ధిదారులకు బిల్లులు పేరిట సొమ్ము వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్మీపురం పంచాయతీ సిపిఎం సర్పంచ్ కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, మండల స్థాయి అధికారుల పని తీరుపై ఆగ్రహిస్తూ అధికారులు మండల కేంద్రంలో స్థిరంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. జల్ జీవన్ మిషన్ పనులపై నిర్లక్ష్యం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలి

- ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించిన ఆదివాసీలు
- సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన గిరిజన ప్రజా ప్రతినిధులు
- 30 లోగా ప్రభుత్వం ప్రకటించకుంటే పోరాటం ఉధృతం



ఎంపిడిఒ కార్యాలయం ఎదుటు బైఠాయించిన నిరుద్యోగులు, మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత లోతా

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి**

ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ ఎపి ఆదివాసి గిరిజన సంఘం, ఆదివాసి జేఏసీ గిరిజన నిరుద్యోగులు, ఆదివాసి ప్రజాప్రతినిధులు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించి గంటల తరబడి బైఠాయించారు. ప్రభుత్వం తక్షణం ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని నినాదాలు చేశారు. నూరు శాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులకే కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జరగవలసిన మండల పరిషత్తు సర్వ సర్వసభ్య సమావేశాన్ని ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా బహిష్కరించి, తీర్మానం చేశారు. ఈ సందర్భంగా లోదొడ్డి సర్పంచ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, ఆదివాసి జేఏసి, ఆదివాసీ గిరిజన సంఘం, పీసా కమిటీ నేతలు వంతు బాలకృష్ణ, తాము సూరిబాబు, వజ్రపు అప్పారావు, కొండ్ల సూరిబాబు, బి రామకృష్ణ, జి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ మెగా డీఎస్సీ పేరుతో ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ఖండించారు. ,ప్రభుత్వం ప్రకటించింది మెగా కాదని, దగా డిఎస్సి అని ఎద్దేవా చేశారు. ఏజెన్సీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీకై ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలని, ఏజెన్సీలో స్థానిక ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

తొలిత అధికారులు ఆదివాసీలకు నూరు శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తీర్మాణం చేస్తామని సమావేశం జరిగేలా చూడాలని, లేదంటే నిధులు వెనక్కి పోతాయని ఆదివాసీలను అధికారులు కోరారు. అయితే దానికి ఆదివాసి గిరిజన సంఘం, జేఏసీ నేతలు నిరాకరించారు. గిరిజన ప్రజాప్రతినిధులందరూ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీని వ్యతిరేకించి సమావేశం బహిష్కరించి బయటకు రావాలని, తమ పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. దీనికి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జడ్పీటిసి వడుగుల జ్యోతి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, అందరూ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బయటకు వచ్చి మద్దతు తెలిపి తమ వెంట ఉంటామని వెల్లడించారు. ప్రభుత్వం ఈనెల 30లోగా ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని లేదంటే ఐక్య ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం భవిష్యత్తు ప్రణాళిక గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగులు ఆదివాసి జేఏసీ, ఆదివాసి గిరిజన సంఘం, గిరిజన ప్రజాప్రతినిధులు ప్రజా సంఘాల నాయకులు తెడ్ల రాంబాబు, జి పెద్దిరాజు, ఏ సుబ్బలక్ష్మి, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మలేరియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీసీఎం చంటిబాబు మాట్లాడుతూ ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఈ వ్యాసరచన పోటీలు నిర్వహించామని, గెలుపొందిన విద్యార్థులకు 25వ తారీఖున బహుమతలు ప్రదానం చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు రాజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని గుర్తించిన అధికారులు

## 64 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

**ప్రజాశక్తి-అడ్డతీగల**

అడ్డతీగల మండలం తుంగమడుగుల పంచాయతీ దుప్పులపాలెం గ్రామంలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 64 బస్తాల రేషన్ బియ్యాన్ని మంగళవారం రాత్రి 9 -10 గంటల మధ్యలో పట్టుకున్నారు. దుప్పులపాలెంలోని ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్నట్లు పక్కా సమాచారంతో అధికారులు నేరుగా దాడి చేశారు. బుధవారం ఉదయం తాసిల్దార్ సూర్యారావు, సర్వేయరు ఎర్రపు దొర, వీఆర్వో రమణ సంఘటన స్థలానికి వెళ్లి గ్రామంలో స్టేట్మెంట్ రికార్డ్ చేయడం జరిగింది. ఆ రేషన్ బియ్యాన్ని అడ్డతీగల గిరిజన సహకార సంస్థ గోడౌన్‌కు అప్పగించడం జరిగిందని తాసిల్దార్ సూర్యారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘాల కూటమి నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి మాట్లాడుతూ తినటానికి తిండి లేక ఎంతో మంది పేదవారు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, నెలకు ఇచ్చే బియ్యం సరిపోక దీనమైన స్థితిలో ఉంటున్నారని అలాంటి వారిని గుర్తించి కార్డుకి 5 కేజీల బియ్యం ఎక్కువ ఇవ్వాలని కోరారు. రేషన్ బియ్యం కొన్న వ్యాపారిని విచారణ చేసి బియ్యం ఎవరి వద్ద నుండి కొనుగోలు చేశారో గుర్తించి, వారికి రేషన్ బియ్యం అవసరం లేనందున వారి రేషన్ కార్డులు తక్షణమే తొలగించాలని కోరారు.


బాబూరావురెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

## సోమిరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**ప్రజాశక్తి-రంపచోడవరం**

మండలం, పెద్ద కొండ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పల్లాల సోమిరెడ్డి కుమారుడు పల్లాల బాబురావు రెడ్డి ఇటీవల ప్రమాదవశాత్తు చనిపోయారు. ఈ నేపథ్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్, మాజీ శాసనసభ్యులు చిన్నం బాబు రమేష్ వారి స్వగ్రామం పెద్ద కొండలోని నివాసానికి వెళ్లి సోమిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చి, పరామర్శించారు తమ కుటుంబానికి ఎల్లవేళలా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం బాబురావు రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడబాల బాపిరాజు, పండా చెల్లన్న దొర, రవిబాబు, కె కొండబాబు, జొజ్జిరెడ్డి, గణపతి రెడ్డి, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్‌లో సత్తాచాటిన 'ప్రభుత్వ' విద్యార్థులు


ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 576


సబిత 550


ధన్యశ్రీ 549


వృశికేష్ 547

ప్రజాశక్తి-రంపచోడవరం : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో గిరిజన గురుకుల విద్యాలయ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 80శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 563 మంది (బాలురు-306, బాలికలు-257) విద్యార్థులు హాజరు కాగా, వారిలో 450 మంది (బాలురు-236, బాలికలు- 214) ఉత్తీర్ణులయ్యారు. 113 మంది (బాలురు- 70, బాలికలు-43) పరీక్షల్లో ఫెయిలయ్యారు. అడ్డతీగల బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి యర్ర ప్రవీణ్ కుమార్ రెడ్డి 576 మార్కులతో ప్రథమ స్థానంలోను, రంపచోడవరం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని చింతకాయల దుర్గ భవాని 571 మార్కులతో ద్వితీయ స్థానంలోనూ, అడ్డతీగల బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి బిత్తిరి రామ్ చరణ్ 566 మార్కులతో తృతీయ స్థానంలోను నిలిచారు. రాజవొమ్మంగి బాలికల గురుకుల పాఠశాల నుండి 80 మంది పరీక్షలు రాయగా, 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారిలో 77 మంది ఫస్ట్ డివిజన్లో పాసయ్యారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఐటీడీఏ పీఓ కట్టా సింహాచలం, డిప్యూటీ డైరెక్టర్ యం.రుక్మాంగదయ్య అభినందనలు తెలిపారు.

**90.91శాతం ఉత్తీర్ణత**

**అడ్డతీగల :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల అడ్డతీగల మండలం నుండి 363 మంది పరీక్షలు రాయగా వారిలో 330 మంది ఉత్తీర్ణత సాధించి 90.91శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు యర్ర ప్రవీణ్ కుమార్ రెడ్డి 576 మార్కులతో ప్రథమ స్థానంలో, బి.రామ్ చరణ్ 566 మార్కులతో ద్వితీయ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.తన్వీర్ 565 మార్కులతో తృతీయ స్థానంలోనూ నిలిచారు. ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ 97 శాతంతో ప్రథమ స్థానంలోనూ, రాయపల్లి జడ్పీ హైస్కూల్ 69 శాతంతో చివరి స్థానంలోనూ నిలిచాయి. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎంఇఓ పి.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

**92 శాతం ఉత్తీర్ణత**

**రాజవొమ్మంగి :** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో రాజవొమ్మంగి మండలంలో 92శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి డివిజన్‌లో మొదటి స్థానంలో నిలిచారు. మండలంలోని లాగరాయి, జడ్డంగి, రాజవొమ్మంగి జెడ్‌పి హైస్కూల్స్, రాజవొమ్మంగి, సింగంపల్లి, అమీనాబాద్, జడ్డంగి ఆశ్రమ పాఠశాలలు, రాజవొమ్మంగి గురుకుల పాఠశాలల నుండి 458 మంది మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 423 మంది ఉత్తీర్ణులయ్యారు. గురుకుల విద్యార్థి కుడుముల సబిత 550 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం, రాజవొమ్మంగి ఆశ్రమ పాఠశాల విద్యార్థి మేరీ ధన్యశ్రీ 549 మార్కులతో ద్వితీయ స్థానం, రాజవొమ్మంగి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి బి.వృశికేష్ 547 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎంఇఓ కెబి సత్యనారాయణ దొర, పాఠశాల హెచ్ఎంలు సుబ్రహ్మణ్యం, గోపాలకృష్ణ, సుశీల అభినందనలు తెలిపారు.

**60 శాతం ఉత్తీర్ణత**


కె.లాస్యంత 582

**ఎటపాక :** పదో తరగతి పరీక్ష ఫలితాలలో మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 60 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అన్ని ప్రభుత్వ పాఠశాల నుండి 268 మందివిద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 161 మంది ఉత్తీర్ణులయ్యారు. నెల్లికుంట ఆశ్రమ పాఠశాల (31మంది), కేవునూరు (35) ఆశ్రమ పాఠశాల, కేజీబీవీ (29), నందిగామపాడు (8), గౌరిదేవిపేట (8), సీతాపురం (10), నెల్లిపాక (11), పినపల్లి (13), గొల్లగూడెం (16) ఉన్నత పాఠశాలల నుండి 161 మంది ఉత్తీర్ణత సాధించారు. నెల్లిపాక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి కందులూరి లాస్యంత 582 మార్కులతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి స్థానంలో నిలిచారు. శ్రీధాత్రి ప్రైవేట్ పాఠశాల నుండి 29 మంది విద్యార్థులు హాజరు కాగా 23 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల విద్యార్థి నల్లజల భావన 566 మార్కులతో మండలంలో రెండో స్థానంలో నిలిచింది.

**66.67 శాతం ఉత్తీర్ణత**

**గంగవరం :** 10వ తరగతి ఫలితాల్లో మండలంలోని 66.67 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల నుండి 279 మంది పరీక్షలు రాయగా 186 మంది ఉత్తీర్ణులయ్యారు. కథం విశిష్ట సాయి 504 మార్కులు, జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని కోడి మోక్ష కాంచన సింధు 504 మార్కులు సాధించారు. విద్యార్థులకు ఎంఇఓ మల్లేశ్వరరావు అభినందనలు తెలిపారు.

**పాడేరు:** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థిని విద్యార్థులకు వేరువేరుగా నిర్వహిస్తున్న సూపర్ 50 ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా ఈ ఏడాది విద్యార్థులు పది ఫలితాల్లో ఉత్తమ మార్కులను సాధించారు. 50 మంది విద్యార్థుల్లో బాలికలే పై చేయి సాధించారు. గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో 28 బాలికలకు, దిగు మోదాపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో 22 మంది బాలురకు పదవ తరగతి పరీక్షలకు ప్రత్యేక బోధన అందించారు. 50 మంది విద్యార్థినీ, విద్యార్థుల్లో 49 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఒక్కరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. బాలికలలో కొంటా గంగా భవాని 577 మార్కులను సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. దుంపా పావని 567, గబ్బాడ ఈశ్వరమ్మ 566, కిల్లో అరుణ 565, జనపరెడ్డి రేవతి 558 మార్కులను సాధించారు. బాలురు ఎస్.త్రినాథ్ 569 మార్కులు, జి.మణికంఠ 550, జి.చరణ్ 535 మార్కులను సాధించారు. ఎస్. కిరణ్ 529, కె.చందు 528, వి. మోహనరావు 525 మార్కులను సాధించారు.

సూపర్ 50 విద్యార్థుల్లో 34 మంది కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్సు ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. 19 బాలికలు, 15 మంది బాలురు ఎంపికయ్యారు. బాలికలు మారికవలస, విసన్నపేట కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్సు ప్రవేశానికి అర్హత సాధించారు. బాలురు జోగంపేట కాలేజ్ ఆఫ్ ఎక్సెలెన్సుకు అర్హత పొందారని ఐటిడిఏ ఇంచార్జి ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

**దుంబ్రిగుడ:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల వ్యాప్తంగా 18 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా 13 పాఠశాలల్లో 573 మంది విద్యార్థులకు గాను 572 మంది హాజరు కాగా, 104 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, సొవ్వా బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత కాలేదు. సోవ్వ ఆశ్రమ పాఠశాలలో 24 మంది విద్యార్థులకు గాను 24 మంది ఫెయిల్ కాగా, కేజీబీవీలో 40 మందికి 40 మంది ఫెయిలయ్యారు. కిల్లోగూడ గవర్నమెంట్ హై స్కూల్ పాఠశాలలో 32 మందికి 14 మంది ఉత్తీర్ణులు కాగా, కిల్లోగూడ ఇంగ్లీష్ మీడియం బాలికల పాఠశాలలో 57 మందికి 19 మంది, కిల్లోగూడ బాలుర ఆశ్రమ పాఠశాలలో 52 మందికి 7, దుంబ్రిగూడ బాలుర ఆశ్రమ పాఠశాలలో 20 మందికి 5, దుంబ్రిగూడ బాలికల పాఠశాలలో 93 మందికి 12, కించుమండ బాలుర ఆశ్రమ పాఠశాలలో 34 మందికి 5, నందివలస 23 మందికి 5, గుంటసీమ 22 మందికి 2, జాంగుడ 106 మందికి 21, అరుకు గవర్నమెంట్ హై స్కూల్లో 42 మందికి 12,దుంబ్రిగుడ గవర్నమెంట్ హై స్కూల్ లో 28 మందికి ఇద్దరు చొప్పున విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. కేజీబీవీ, సొవ్వ పాఠశాలల్లో ఏ ఒక్క విద్యార్థి కూడా ఉత్తీర్ణత కాకపోవడం ఇది మొదటిసారి.

**పెదబయలు:**మండలంలో 48.10 శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి కొమ్ము కృష్ణమూర్తి తెలిపారు. మండలంలో కోడా పరమేష్ 481 మార్కులు (గిరిజన ఆశ్రమ పాఠశాల ఆరడకోట) సాధించాడు. నేరోడి సందీప్ శివ 475 (జిల్లా పరిషత్ పాఠశాల సీతగుంట) వెచ్చని జోస్నా 471 మార్కులు సాధించారు. సెంటెన్స్ పాఠశాలలో ఆశ లిల్లీ 555, గుల్లెల నిషి 554 గ్రేస్ 538 మార్కులు సాధించారు.

**ముంచింగిపుట్టు:** మండలంలోనీ 14 పాఠశాలల నుండి 148 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 140 మంది ఉత్తీర్ణత పొందారని మండల ఎంఈఓ కోడా కృష్ణమూర్తి తెలిపారు. మండలంలో కిముడు తనుశ్రీ 480 మార్కులు సాధించారు.

**అనంతగిరి:**మండలంలోని పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామ్ ఫలితాలలో 700 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 219 మంది విద్యార్థులు అతి తక్కువ మార్కులతో పాస్ కాగా 481 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

**చింతపల్లి :** మండలంలో 13 పాఠశాలల్లో 662 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 125 మంది ఉత్తీర్ణత సాధించారు. 537మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. చింతపల్లి సెయింట్స్ హైస్కూల్‌లో 58 విద్యార్థులు పరీక్ష రాయగా 48 మంది ఉత్తీర్ణులయ్యారు. చింతపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని ఉల్లి గ్రాసి 528 మార్కులు సాధించింది.

**హుకుంపేట:** హుకుంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని భువనేశ్వరి 466 మార్కులు సాధించింది. మండలంలో 644మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అయ్యారు. సిహెచ్ ఈశ్వరరావు 464 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచాడు. భువనేశ్వర్ కి మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## మాంటిస్సోరీ విద్యార్థిని ప్రతిభ


జిల్లా ప్రథమ స్థానం సాధించిన మాధవిని సత్కరిస్తున్న కలెక్టర్

**కూనవరం :** మండలంలోని టేకులబోరు మాంటిస్సోరీ విద్యార్థిని అరవ మాధవి 10వ తరగతి పరీక్షల్లో 590 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. గొమ్ము అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన మాధవి ఇంతటి విజయాన్ని సాధించి గ్రామానికి, మండలానికి మంచి పేరు తీసుకురావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఇదే పాఠశాలలో చదివిన ఆమె అన్నయ్య కూడా గతంలో మండల టాపర్‌గా నిలిచి ఇప్పుడు నూజివీడు జెఈఈ మెయిన్స్‌లో జిల్లా మొదటి స్థానంలో నిలవడంతో వారి తల్లితండ్రులు, మాంటిస్సోరి ప్రిన్సిపాల్ విక్కీ సింగ్ ఆనంతరం వ్యక్తం చేశారు.

## శ్రీమోదమాంబ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ


మధుబాబు 576


లక్ష్మీప్రసన్న 574


షణ్ముఖ భువనేష్ 574

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు శ్రీమోదమాంబ హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభను చాటారు. రామిశెట్టి మధుబాబు 576, కిముడు లక్ష్మీప్రసన్న 574, డూరు షణ్ముఖ భువనేష్ 553 మార్కులు సాధించి అగ్రశ్రేణిలో నిలిచారు. 500 కి పైగా మార్కులు సాధించిన వారు 18 మంది ఉన్నారని పాఠశాల యాజమాన్యం తెలిపారు. సాధారణమైన విద్యార్థులతో ఇంతటి అసాధారణ మార్కులు సాధించడానికి కారణం విద్యార్థులను ప్రణాళికా బద్ధంగా చదివించటం, విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల నిర్విరామ కృషి తల్లిదండ్రుల సహకారమేనన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేసారు.




## కెకె.రాజుకు శుభాకాంక్షలు

**ప్రజాశక్తి-సీతమ్మధార :** వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన కమ్మిల కన్నప్ప రాజు (కెకె.రాజు)కు సీతమ్మధారలోని ఆయన కార్యాలయంలో బుధవారం పలువురు నాయకులు కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, పీలా వెంకటలక్ష్మి, సంతోష్, అంబేద్కర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విశాఖ జిల్లా అధ్యక్షునిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పూర్వవైభవానికి కృషిచేస్తానని చెప్పారు.

## హోమియోతో దీర్ఘకాలిక రోగాలు నయం

**ప్రజాశక్తి-సీతమ్మధార :** హోమియో వైద్యంలో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, అనేక దీర్ఘాకాలిక రోగాలు నయమవుతాయని డాక్టర్ జ్యోతి వాణి తెలిపారు. ద్వారకానగర్ ఐదవ లైన్‌లో స్పర్శ హోమియో కేర్ పేరిట ఏర్పాటుచేసిన వైద్యశాలను డాక్టర్ మళ్ల హేమంత్‌తో కలిసి డాక్టర్ జ్యోతివాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హోమియోపతితో 200 కంటే ఎక్కువ ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కల్పిస్తామని, అంకితభావంతో అత్యుత్తమమైన హోమియో వైద్యం అందిస్తామని తెలిపారు. ఆధునిక పద్ధతులతో అనేక దీర్ఘకాల వ్యాధులు నయం చేస్తామని చెప్పారు. ఎటువంటి నొప్పికైనా సహజ సిద్ధ వైద్యంతో నయంచేస్తామని, అత్యాధునిక పరికరాలతో రోగ నిర్ధారణ చేస్తామని తెలిపారు. మానసిక రుగ్మతులకు కౌన్సిలింగ్ చేస్తామన్నారు. ప్రారంభోత్సవ కానుకగా 15 శాతం తగ్గింపు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. డాక్టర్ జ్యోతివాణి, డాక్టర్ మళ్ల హేమంత్‌కు పలువురు స్నేహితులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.


హోమియో ఆసుపత్రి ప్రారంభంలో డాక్టర్ జ్యోతివాణి


వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాశక్తి-అడ్డతీగల :** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల కేంద్రంలో వినాయక తాపీ పని వారి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాసిల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. తమ సమస్యలపై డిప్యూటీ తాసిల్దార్ తేజస్విని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వినాయక తాపీ పని వారి సంక్షేమ సంఘం కార్యదర్శి, సిఐటియు మండల అధ్యక్షుడు సురేష్ బాబు మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్ వెల్ఫర్ బోర్డు పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లో వెంటనే నిధులు చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికులకు నష్టకరమైన లేబర్ కోర్టు రద్దు చేయాలని, కార్మికుల సంక్షేమ అమలు కోసం ఉద్దేశం చేసిన సెస్ విడుదలను కార్మికుల సంక్షేమం మాత్రమే ఖర్చు చేయాలని, గత ప్రభుత్వం అక్రమంగా తీసుకుని నిధులను తక్షణమే తిరిగి చెల్లించాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు గృహ నిర్మాణం వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీతో కూడిన లోన్ ఇవ్వాలని, ఇతర రాష్ట్రంలో అమలవుతున్న భవన నిర్మాణ కార్మికులకు మరిగిన సంక్షేమ పథకాల అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ ఇవ్వాలని, కార్మికుల పనుల కోసం వేచి ఉండే అడ్డాలు కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని, నిర్మాణంలో ఉపయోగించే వస్తువులపై జిఎస్టి తగ్గించాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణం కార్మికులు లోవరాజు, ఎలక్ట్రికల్ యూనియన్ నుండి బా లు రెడ్డి పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** విశాఖ స్టీల్‌ప్లాంట్ స్ట్రాటజిక్ సేల్ నిర్ణయాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును ఆపాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు బుధవారం నాటికి 1475వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చినట్టే ఇచ్చి డ్రామా నడుపుతోందన్నారు. కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఈ కుట్రను టిడిపి, బిజెపి, జనసేన కూటమి ప్రభుత్వం ఆపాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన ప్యాకేజీ డబ్బును ప్లాంటు ఉత్పత్తికి, యంత్రాలకు, ముడి సరుకులకు, కార్మికుల జీతభత్యాలకు చెల్లించకుండా రూ.1140 కోట్లు బ్యాంకు అప్పులు చెల్లించారన్నారు. రూ.500 కోట్లును జిఎస్‌టి పేరుతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుందన్నారు. రూ.6700 కోట్లు ఇతర అప్పులు తీర్చారన్నారు. మిగిలింది రూ.3 వేల కోట్లు మాత్రమేనన్నారు. ఈ నిధులకు కూడా పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని, పూర్తి ఉత్పత్తి రాబట్టాలని షరతులు పెట్టారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 1100 మంది పర్మనెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపుతున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను 5400 మందిని తొలగించేందుకు సిద్ధపడ్డారన్నారు. ఇప్పటికే 960 మంది పాసులు రెన్యువల్ చేయకుండా, విధులకు హాజరుకాకుండా నిలిపివేశారన్నారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరినీ యధావిధిగా విధుల్లోకి కొనసాగించాలని, ఏ ఒక్కరినీ విధుల నుంచి తొలగించరాదని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న అన్ని స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయన్నారు. సొంత గనులు లేని ఏకైక స్టీల్ ప్లాంట్ విశాఖ స్టీల్ ప్లాంట్ మాత్రమేనని తెలిపారు. ఎన్నో త్యాగాలు చేసి పోరాటాలతో సాధించుకున్నటువంటి స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతోనే నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కె.మణి, కె.కుమారి, బొట్టా ఈశ్వరమ్మ, వి.ప్రభావతి, ఎల్.కామేశ్వరి, స్వర్ణలత, పి.శారద, రిటైర్డ్ ప్రొఫెసర్ సింహాద్రప్పడు, గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

## 26 నుంచి ఏయు శతాబ్ది ఉత్సవాలు

**విసి జిపి.రాజశేఖర్**



వివరాలు వెల్లడిస్తున్న విసి రాజశేఖర్

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి సిద్ధమైందని వర్సిటీ ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 26న శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు ఆర్కే బీచ్ నుంచి ఏయూ కన్వెన్షన్ సెంటర్ వరకు వాక్‌థాన్ నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఉదయం 9 గంటలకు ఏయు పరిపాలన భవనం వద్ద శతాబ్ద ఉత్సవాలకు సంబంధించిన బెలూన్ లాంచింగ్ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ బాగ్చి చేతుల మీదుగా నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 3:30 గంటల నుంచి ప్రధాన వేడుకను జరుపుతామని తెలిపారు. మధ్యాహ్నం జరిగే శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుకలకు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి, ఐఐటి పాలకడ్ డైరెక్టర్ ఆచార్య ఎ.శేషాద్రి శేఖర్ అతిథులుగా హాజరవుతారన్నారు. శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అనంతరం అతిథుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. తరువాత విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ, ఏడాది కాలంలో నిర్వహించే కార్యక్రమాలతో కూడిన వార్షిక క్యాలెండర్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. శతాబ్ది సంవత్సరాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. త్వరలో శతాబ్ది సంవత్సరంలో నిర్వహించే విభిన్న కార్యక్రమాలతో కూడిన సవివర నివేదికను, ప్రణాళికను అందరికీ అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు పాల్గొన్నారు.

## 27న గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక సమావేశం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక రాష్ట్ర సమావేశం 27 న విజయవాడలో నిర్వహించనున్నట్టు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు ఆహ్వాన పోస్టర్‌ను బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పార్కులో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజుతో పాటు ప్రముఖ కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక విశాఖ జిల్లా కన్వీనర్ బసు పోతన, ఉప్పల అప్పలరాజు మాట్లాడు తూ గ్రంథాలయాల సెస్సును ప్రభుత్వాలు గ్రంథాలయాల అభివృద్ధికి వినియోగిండం లేదని, వాటిని దౌర్భాగ్య స్థితిలోకి నెట్టేశాయని ఆరోపిం చారు. విశాఖలో గ్రంథాలయ నిర్వహణకు సరిపడా పెద్ద స్థలం ఉన్నా కూడా ఒక చిన్న ప్లాట్‌లో దానిని నడుపుతున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొంద న్నారు. మిగతా గ్రంథాలయాల నిర్వహణ కూడా ఈ విధంగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ద్విభాష్యం రాజేశ్వరరావు మాట్లాడుతూ, గ్రంథాలయాల్లో మంచి వాతావరణం ఉంటే, యువతకు చదువుపై ఆసక్తి నెలకొంటుందని వారి అభ్యున్నతికి అవి దారి తీస్తాయన్నారు. పుస్తకం చదివినపుడు వచ్చే అనుభూతి మొబైల్, లాప్‌టాప్‌లో చదివితే రాదన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని గుర్తు చేస్తూ గ్రంథాలయం అనేది మానవ వికాసానికి, ఉన్నతికి ఉపయోగపడుతుందని గాంధీ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ కెవిఎస్ మూర్తి అన్నారు. ఒకప్పుడు గ్రంథాలయాలు దేవాలయాల్లా ఉండేవని, విద్యార్థుల ఉన్నతికి, వికాసానికి అవి ఎంతో అవసరమని సంస్థ ప్రధాన కార్యదర్శి సహదయ సాహితీ ప్రతినిధి సి.హెచ్.చినసూర్య నారాయణ అన్నారు. గ్రంథాలయాల అభివద్ధి విషయంలో ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని విశాఖ రచయితల సంఘం అధ్యక్షులు అడపా రామకష్ణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి కార్యకర్త ఎస్.అప్పా రావు, విశాఖ సాహితీ సంస్థ అధ్యక్షుడు గండికోట విశ్వనాధం, అమరావతి సొసైటీ తరపున పిఎల్వీ ప్రసాద్, ప్రముఖ కథా రచయిత, బాలల హక్కుల కార్యకర్త హరి వెంకట రమణ, ప్రొఫెసర్ సింహాద్రప్పడు, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ రాజు,రాంప్రభు తదితరులు పాల్గొన్నారు

## పల్లాను టిడిపి అధ్యక్ష పదవి నుంచి తొలగించాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** తెలుగుదేశం పార్టీ సంస్కృతికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పల్లా శ్రీనివాసరావును తక్షణమే పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని, తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పట్ల పల్లా శ్రీనివాసరావు అనుచితంగా ప్రవర్తించారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లానని, ఈ క్రమంలోనే పల్లా శ్రీనివాసరావు అనుచరుడు ప్రసాదుల ఒక ప్రకటన విడుదల చేస్తూ, బి.వి.రామ్ బ్లాక్ మైలర్, తెలుగుశక్తికి అధ్యక్షుడు కాదు తెలుగు బ్రోకర్ అంటూ తీవ్రవ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు. పల్లా శ్రీనివాసరావు చెప్పినందునే ప్రసాదుల ఈ రకమైన వ్యాఖ్యలు చేశారన్నారు. పల్లా అనుచరుడు చేసిన ఆరోపణలు నిజమో కాదో తెలియాలంటే, తనపై సీబీఐ చేత విచారణ చేయించుకోవచ్చుని సవాల్ విసిరారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు అక్రమాలకు పాల్పడుతున్నారని, దీనికి ప్రత్యక్ష ఉదాహరణ గాజువాక జంక్షన్‌లో పల్లా శ్రీనివాసరావు సమీప బంధువునకు చెందిన ఒక భారీ భవన నిర్మాణానికి అనుమతులు లేకపోయినప్పటికీ నిర్మాణ పనులు చురుగ్గా చేపట్టడమే అన్నారు.

ఈ నెల 29 న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖపట్నం వస్తున్నారని, ఒక గంట పాటు సమయం కేటాయిస్తే గాజువాకలో పల్లా కొనసాగిస్తున్న అరాచకాలను ప్రజలే బయటపెడతారన్నారు. ఆయన తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి ఆధారాలు ఉన్నాయని వాటిని ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలోనే బయట పెడతానని రామ్ ప్రకటించారు. గాజువాక పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై తాను ఇప్పటికే ఫిర్యాదు కూడా చేశానని, పల్లా శ్రీనివాసరావును ఏ1, ప్రసాదుల శ్రీనివాస్‌ను ఏ2 ముద్దాయిలుగా చేర్చాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

## మునిగిన 48 గ్రామాలకు ప్యాకేజీ ఇవ్వాలి

**ప్రజాశక్తి-కూనవరం :** 2022 వరదలో మునిగిన మండలంలోని 48 గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. చింతూరు ఐటిడిఎలో బుధవారం కలెక్టర్ దినేష్ కుమార్‌ను సీపీఎం నాయకులు కలిసి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉన్న భూములకు నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని, గిరిజనులకు భూమికి భూమి తక్షణమే ఇవ్వాలని కోరారు. కోతులుగుట్ట నుండి ఏడుగురాళ్ళపల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ రోడ్డు లేక పోవడం వల్ల గోదావరి వరదలకు అత్యవసర పరిస్థితిలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కాబట్టి రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచి త్వరగా రోడ్డు నిర్మించాలని కోరారు. బురదగూడెం నుండి తుమ్మల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. భీమవరం నుంచి బురదగూడెం వరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, బిఎస్ఎన్ఎల్ సెల్ నెట్ వర్క్ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూనవరం మండలంలో ఉపాధి హామీ నిధులు సిసి రోడ్లుకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, ఎంపీటీసీలు ధర్ముల అమ్మోజీ, కారం జయసుధ, సర్పంచ్ బి.వెంకమ్మ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, నాయకులు నూప రాజు తదితరులు పాల్గొన్నారు.

## జీవిత బీమా పథకంలో పేర్లు నమోదు

**ప్రజాశక్తి-రంపచోడవరం :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలు మేరకు ప్రతి ఒక్కరూ జీవిత బీమా పథకంలో పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాసు దొర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం తెల్ల రేషన్ కార్డు కలిగి 18 సంవత్సరములు నుండి 70 సంవత్సరాలు వరకు వేతన దారులు అందరు సదరు పథకమునకు అర్హత కలిగి ఉన్నారని, సంవత్సరపు చందా కేవలము 20 రూపాయలు మాత్రమే అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం కింద 18 సంవత్సరముల నుండి 50 సంవత్సరములు మధ్య వయస్కులు అర్హత కలిగి ఉన్నారని వీరు సంవత్సరమునకు 436 రూపాయలు చందా చెల్లించినచో డెత్ బెనిఫిట్ కవరేజ్ ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకోవలసినదిగా కోరారు.

## ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి సిపిఎం ఆధ్వర్యాన జగదాంబ జంక్షన్‌లో కొవ్వొత్తులతో ఘన నివాళ్లర్పించారు. విశాఖవాసి రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పిరికి పందల చర్యగా దాడిని పేర్కొన్నారు. తక్షణం కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉగ్రవాదులు ఎంతటి వారైనా పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బిజెపి ప్రభుత్వం ఉగ్రవాదాన్ని అరికట్టాలన్నారు. నిత్యం వేలాదిమందితో రద్దీగా ఉండే పహల్గావ్ పర్యాటక ప్రాంతంలో ఉగ్రవాదులు ఎలా జొరబడ్డారని, నిఘా వ్యవస్థ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కుమార్, నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, వై.రాజు, పి.వెంకట్ రెడ్డి, జగదాంబ జోన్ కన్వీనర్ ఎం.సుబ్బారావు, నాయకులు కర్రి చంద్రశేఖర్, అనపర్తి అప్పారావు, పి.వెంకటరావు, కె.కుమారి పాల్గొన్నారు.